# కొత్తరకం పెళ్ళిచూపులు

– రమైతాంగి



అరుణ తనకు జరిగిన పెళ్ళిచూపుల గురించి గొప్పగా వర్ణించి చెప్తూంటే శకుంతలకు ఎంతయినా వళ్ళుమండి పోయింది.

"ఛీ...ఛీ... సిగ్గుకలేపోతే సరి" అంది కోపంగా చూస్తూ. ఆ మాటకి అదిరిపడిన అరుణ అంతలోనే సర్దుకుని ఎవరికే సిగ్గులేనిదీ ?" అంది తెల్లబోతూ.

"ఇంతెవరికి నీకేను" పెంకిగా జవాబిచ్చింది శకుంతల.

"నాకా! ఎందుకూ ?" చిరాగ్గా చూసింది అరుణ.

"ఎందుకేమిటే, బి. ఎ. పాసై, ఉద్యోగంచేస్తూ, బి. సి. నాటి అమ్మాయిలా పెళ్ళి చూపులకు తయారయ్యి, పైగా సిగ్గులేకుండా చెప్పుకుంటున్నావు కూడా. ఈసడించేసింది శకుంతల.

"మరి, పెళ్ళి చేసుకోబోయే ముందు, కాబోయే భర్త ఎలా ఉంటాడో, ఏం ఉద్యోగం చేస్తున్నాడో ఇత్యాది విషయాలు తెలుసుకోకుండానే, ఇష్టాఇష్టాలు కనుక్కోకుండానే పెళ్ళాడేయమనా నీ ఉద్దేశ్యం?" ఈసారి అరుణకూ కోపం వచ్చింది. ఏమిటే ఈ శకుంతల ఉద్దేశ్యం? పెళ్ళి చేసుకునే అబ్బాయిలు, అమ్మాయిలు ఒకర్నొకరు చూసుకోకుండా, ఇష్టం వ్యక్తం చేసుకోకుండా ఎలా పెళ్ళిచేసుకుంటారు అనుకుంది.

"అలా అని నేను అనలేదే" కొంటెగా నవ్వింది శకుంతల.

"మరి నీ ఉద్దేశ్యం?" గట్టిగా రెట్టించింది అరుణ.

పాతికేళ్ళ క్రితం అమ్మాయిలు ఇంతగా చదువుకునేవారు కాదు. ఓ వేళ చదువుకుంటే, చాకలి పద్దు వేయడం వరకో ఉత్తరం రాసేపాటి వరకో చదువుకునేవారు. అటువంటి అమ్మాయిలకు పెళ్ళిచేయాలంటే, పెద్దవాళ్ళే వచ్చి చూసుకుని, అన్నివిధాల ఆ అమ్మాయి తమకునచ్చితే "మీ అమ్మాయి నచ్చింది 'అని కబురుచేసి, ఇచ్చిపుచ్చుకోడాలు నిశ్చయం చేసుకుని ముహూర్తాలు నిశ్చయించుకునేవారు. కొన్నాళ్ళ తర్వాత కాలం కొంచం మారింది అబ్బాయి వచ్చి అమ్మాయిని చూసుకోవడం, మధ్యలో ఏవో కొన్ని ప్రశ్నలు వేయడం, ఇష్టపడటం జరుగుతున్నది. అది ఒకనాటి ఆడపిల్ల, కథ కాని, ఇప్పటి రోజులు ఇంకా మారిపోయాయి. ఆడపిల్లా, మగవాడితో సమానంగా చదువుకుంటున్నది, ఉద్యోగం చేస్తూ, కుటుంబాన్ని ఆదుకుంటున్నది. అయినా పెళ్ళివిషయంలో మాత్రం, ఇంకా పూర్తి మార్పు రావడంలేదు. పాత ఆచారాల ప్రకారం, పెళ్ళికొడుకు రావడం, అమ్మాయిలను చూట్టం, ఏవో పిచ్చిప్రశ్నలు వేయడం, ఇంకా జరుగుతూవున్నాయంటే అందుకు మనమే దోహదం చేస్తున్నాము అవునా" ఆగింది శకుంతల.

"అదా నీ అభిప్రాయం" ఎంత పిచ్చిదానివి అన్నట్లు తేలిగ్గా నవ్వేసింది అరుణ.

"అలా నవ్వకు, నాకింకా కోపం వస్తుంది"

"మరి నవ్వక, ఏం చేయమంటావు?"

"ఏడవమంటాను, అలా అడగడానికి సిగ్గువేయడం లేదూ 'ఇటువంటి పెళ్ళిచూపులు నాకిష్టంలేదు,' అని ఎదురు తిరుగు. అబ్బాయి అమ్మాయి ఫ్రీగా మాట్లాడుకోవాలి. ఒకరి ఇష్టాలు, అభిరుచులు ఒకరికొకరు తెలుసుకోవాలి, అదీ పెళ్ళి చూపులంటే అర్థం, అంతేగాని ముక్కూ మొహం తెలియని వ్యక్తిని చూసి, అమాంతం ప్రేమించేసి, ఆనక

పెళ్ళిచేసుకుని మనిద్దరిపీ ఉత్తర దక్షిణ ధృవాలు, అని చెప్పుకుంటూ కీచులాడుకుంటూ దాంపత్య జీవితాన్ని నరకమయం చేసుకుంటూ ఎందుకొచ్చిన పెళ్ళిరా బాబూ అని ఒకర్నొకరు ద్వేషించుకుంటూ జీవించడమేనా పెళ్ళి చూపుల యొక్క నిర్వచనం" ఆవేశంతో ఊగిపోతున్నది శకుంతల.

ఇవ్వాళ దీనికి ఏదో పూనింది అనుకుంది అరుణ.

''చూడమ్మా శకుంతలా బియ్యే గారూ" పిలిచింది.

శకుంతల తలెత్తి ఏమిటి అన్నట్లు చూసింది.

'నువ్వు అన్నట్లే 'ఈ పెళ్ళి చూపుల తతంగం నాకిష్టంలేదు, అని ఎదురు తిరుగుతాను. కావలిస్తే ఓ హోటల్లో ఫామిలీ కాబిన్‌లో మేము ఫ్రీగా మాట్లాడుకునే ఏర్పాట్లు చేయండి' అంటాను. మరి అందుకు అవతలవాళ్ళు ఒప్పుకోకపోతే"

దాని బాబులాంటిమరోడి వస్తుంది" తాపీగా జవాబిచ్చింది శకుంతల.

"అదీ ఒప్పుకోకపోతే, ఆడపిల్ల మరీ ఇంత బరితెగించడమా, ఈ సంబంధం మాకొద్దు" అంటే, ఇంకోటి, ఇంకోటి రాకపోతుందా అంటావు. నీది వడ్డించిన విస్తరిలాంటి జీవితం. వరుణ్ణి వెతుక్కుంటూ నువ్వు వెళ్ళక్కర్లేదు. నిన్నే వెతుక్కుంటూ వరుడు వస్తాడు. ఆ శక్తి మీ ఫేమిలీకి వుంది కనుక నీకు ఫరవాలేదు. కాని నలుగురు ఆడపిల్లలు గల కుటుంబము మాది. నా పెళ్ళికే నిరీక్షిస్తూ కూర్చుంటే చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు ఎప్పటికవుతాయి. కనుక నూతన పంథాలో నడిచే ఆ పెళ్ళి చూపులేవో నీకే ఏర్పాటుచేసుకో, నన్ను మాత్రం, పెద్దవాళ్ళ మూఢాచారంలోనే బ్రతకనివ్వు" అంటూ విసవిస నడుస్తూ వెళ్ళిపోయింది అరుణ. వెళ్ళే మిత్రురాలిని తెల్లబోయి చూస్తూ నిలబడిపోయింది శకుంతల.' వాళ్ళ బాగుకోరి చెప్పినా అర్థంచేసుకోరు కొందరు అనుకుంది దిగులుగా అరుణ నుద్దేశించి.

అరుణా, శకుంతలా హైస్కూలు నుంచి కాలేజీ చదువువరకూ కలిసికట్టుగానే చదువుకున్నారు. డిగ్రీ పూర్తవగానే చెరో ఆఫీసులోనూ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. కాలేజీలో చేరినప్పుడే అరుణకు పెళ్ళిచేయాలనుకున్నారు వాళ్ళపెద్దవాళ్ళు. కాని డిగ్రీ పూర్తయితేగాని పెళ్ళిచేసుకోనని, అరుణ కచ్చితంగా చెప్పడంతోనే ఆ ప్రయత్నాలు మానుకున్నారు వాళ్ళు. డిగ్రీ పూర్తవడం, జాబ్‌లో చేరడం జరిగి అప్పుడే రెండేళ్ళు పూర్తికావస్తున్నది. ఈ రెండేళ్ళల్లోనూ అయిదారు సంబంధాలు వచ్చివెళ్ళాయి, కాని ఒక్కటీ కుదరలేదు. కారణం, వాళ్ళకి నచ్చితే వీళ్ళకి నచ్చక, వీళ్ళకి నచ్చితే వాళ్ళకు నచ్చక, ఏదీ కుదరలేదు. కాని ఈసారి

వచ్చిన సంబంధం, అరుణకు చాల నచ్చింది. వాళ్ళు సుముఖంగానే కనిపించారు కనుక వాళ్ళకీ తను నచ్చినట్లే అని నిర్ధారణ చేసుకున్న అరుణ వాళ్ళ దగ్గర్నుంచి 'మీ సంబంధం మాకు నచ్చింది' అనే కబురుతో వచ్చే ఉత్తరంకోసం ఎదురుచూస్తున్నది. అటువంటి సమయంలో శకుంతల మాటలు వింటుంటే తనకి ఎంత బాధగా వుంటుందీ. అందుకే ఇలా అనుకున్నది

"నీకింకా అటువంటి విషయాలు అనుభవంలేక అలా ఉద్రేకపడ్తున్నావు. రేపు నీకూ పెళ్ళిచూపులంటూ జరిగితే నువ్వూ నాలాగే పెద్దవాళ్ళ అభీష్టం ప్రకారమే నడుచుకుంటావు సుమా" అని, మాటలకూ, చేతలకూ చాల వ్యత్యాసం వుంది. ఆ సంగతినాకు తెలియదా అని కూడా అనుకుంది 'అరుణ వెళ్ళిపోయాక మరక్కడ కూర్చో బుద్ధిగాక తనూ లేచింది శకుంతల.

''ఉండండి నేనూ వస్తున్నా" అనే మాటకిఉలిక్కిపడి వెనక్కితిరిగిచూసింది శకుంతల. మాటల్లోపడి చుట్టూ పరిసరాలనే మర్చిపోయినందుకు అమితంగా సిగ్గుపడి "మీ రొచ్చి ఎంత సేపయ్యింది" అని పలకరించింది ఆమెను.

''మీరువచ్చిన కాస్సేపటికే నేనూ వచ్చాను.మిమ్మల్ని పలకరించానుకూడా, కాని నా ఉనికినే గమనించలేదు మీరు'' ఆమె నవ్వింది చిన్నగా. ఆమె పేరు విమల, ఓ స్కూల్లో రైటరుగా వుంటున్నది. అప్పుడప్పుడు అదే పార్కులో ఎదురుపడ్తూ వుంటుంది.శకుంతలావాళ్ళు వచ్చి వెళ్ళిపోతుంటే తను రావడమో, వాళ్ల వస్తుంటే తను వెళ్ళడమో జరుగుతుంటుంది. ఎప్పుడో ఒక్కసారి ముగ్గురూ కలిసి, ఆఫీసుల్లో జరిగే అవకతవకలు, అన్యాయాల గురించి మొదలు, రోజురోజుకీ పెరిగిపోతున్న ధరలవరకూ ధారాళంగా మాట్లాడుకుంటూ వుంటారు. అదే వాళ్ళ మధ్య వున్న పరిచయం.

"ఏమిటి అంత ఆవేశంగా మాట్లాడ్తున్నారు, పెళ్ళిచూపుల గురించేనా?'' అడిగిందామె నవ్వుతూ. "మీకు పెళ్ళిచూపులంటే నచ్చదా?", విమల గొంతులో కుతూహలం ''అయితే మా మాటలు మీరూ విన్నారన్నమాట..." తడబడిపోయింది శకుంతల...

ఆ మాటకి జవాబు చెప్పకుండా "మీ ఫ్రెండుకి బాగా కోపం వచ్చినట్లుంది" అందామె నవ్వుతూ. ''అయినా మీ మాటలు సరిగ్గా అర్థంచేసుకుని వుండరామె.''

'అవును' మనసులోనే అనుకుంది శకుంతల. మొగ పెళ్ళివారు రావడం, అంత చదువూ చదివిన అమ్మాయి, ముద్దరాల్లా తలవంచుకుని కూర్చోవడం, వాళ్ళు ఏవో అడగడం, అమ్మాయి బుద్ధిమంతురాల్లా సమాధానం ఇవ్వడం,

వాళ్ళ ఇంటికెళ్ళి ఏ సంగతీ రాస్తాన నడం, వాళ్ళు రాసేదానిమీదే తన అదృష్టం ఆధారపడి వుందని అమ్మాయి అనుకోవడం కొండొకచో అనుకున్నది తప్పిపోవడం, అమ్మాయి, ఆమె తాలూకు వ్యక్తులు నిరాశపడటం, ఈ పద్ధతి మారలేదు మన కుటుంబాల్లో. అది మారాలని నా అభిప్రాయం. అబ్బాయి అమ్మాయి సంకోచాలు లేకుండా ఫ్రీగా మాట్లాడుకోవాలి. 'ఇంటికి వెళ్ళిరాస్తాము' అనకుండా, అప్పుడే తమ యిష్టాలను మనసు విప్పి వ్యక్తంచేసుకునే పద్ధతి రావాలంటాను."

"అవును మీరు చెప్పింది సబబుగానే వుంది. కాని మన కుటుంబ వ్యవస్థ అంత పురోగమించలేదింకా. మా గిరన్నయ్యా మీలాగే అంటాడు, 'వెళ్ళి పిల్లను చూసిరా అంటే."

"మీ బ్రదర్ ఏం చదివారు ?" చటుక్కున అడిగి నాలిక కర్చుకుంది శకుంతల. 'అలా ఎందుకడిగానా' అన్నట్లు. "బ్రదర్ అంటే స్వయానా అన్నగారు కాదు. పెదనాన్నగారి అబ్బాయి. ఎమ్. బి. ఎ. చదివి స్టేట్ బ్యాంక్‌లో అసిస్టెంటు ఆఫీసర్‌గా జాబ్ చేస్తున్నారు" వివరంగా చెప్పింది విమల. ఇద్దరూ సెంటర్లో విడిపోయారు.

* * *

ఆఫీసుకి ఆలస్యమైపోయిందని విసుక్కుంటూ తల దువ్వుకుంటున్న శకుంతల దగ్గరకు తల్లి వచ్చి ఈ రోజు శలవు పెట్టవే అమ్మాయీ" అంది.

"శలవా ! ఎందుకూ, ఈ రోజు మనింట్లో ఏమైనా విశేషమా ?" కళ్ళు చిట్లించి అడిగింది శకుంతల.

"ఆ విశేషమే. ఈ రోజు మామయ్య ఎవర్నో తీసుకొస్తానని చెప్పారు" తల్లి ముసి ముసిగా నవ్వింది.

"మామయ్య ఎవర్నో తీసుకొస్తే మధ్య నేనెందుకూ శలవు పెట్టడం" అని అడుగుతున్న కూతురి అమాయకత్వాన్ని చూసి ఆ తల్లి ఇంకా నవ్వుకుంది.

"అదేమిటే శకూ, ఆ వచ్చేది నీ కోసమే అయినప్పుడు నువ్వు లేకపోతే ఎలా ?"

"అంటే అర్థం? "అట్టే ఆలోచించిన శకుంతలకు ఆ మాటలో అర్థం అప్పుడు స్ఫురించి' అలాగా, అయితే తప్పకుండా ఆఫీసుకు వెళ్ళాల్సిందే అని సన్నగా గొణుక్కుంది.

"ఏఁవిటే అంటున్నావు ?"

"ఇవ్వాళ మా ఆఫీసు ఇనస్పెక్షన్ జరుగుతుందమ్మా. తప్పకుండా వెళ్ళాలి వచ్చినవాళ్ళు అప్పుడే వెళ్ళిపోరు కదా ఆఫీసుకెళ్ళి ఇనస్పెక్షన్ పూర్తికాగా పర్మిషన్ పెట్టి వస్తాను. అప్పుడే ఏర్పాట్లేవో చేద్దువుగాని" ఉత్సాషంగా నవ్వింది శకుంతల.

"అవ్వ ఎంత సిగ్గులేకుండా చె న్నావే. మా కాలంలో ఈ చోద్యా

ఎరగమమ్మా" తల్లి బుగ్గలు నొక్కుకుంది.

మీ కాలానికి మా కాలానికి మధ్య చాలా సంవత్సరాలు తేడా వుందమ్మా. మీ కాలంలో శేరు బియ్యం నాలుగణాలు, వీశ వంకాయలు అణాకి వచ్చేవి, కాని ఇప్పుడో? శేరు బియ్యము మూడున్నర, వీశ వంకాయలు రెండ్రూపాయలు. ఆ రోజుల్లో ఇంటి పెద్ద సంపాదనతో ఇంటిల్లిపాదీ సంతుష్టిగా తిని, సుఖంగా బ్రతికేవారు కాని ఇప్పుడో? ఇంట్లో అందరూ సంపాదనపరులైనా చాలీ చాలని బ్రతుకులుగానే మిగిలిపోతున్నారు. చూసావా నీ తరానికి మా తరానికి మధ్య ఎన్ని యోజనాల దూరముందో" నవ్వింది శకుంతల.

"ఏమోనమ్మా ఏదో చెప్తావు, ఆ మాటలు నాకు అర్థం అవుతాయా పాడా, ఇంతకీ నువ్వు శలవు పెట్తావా లేదా?"


తల్లిని ఏమార్చడం తనవల్ల కాదని అనుకున్న శకుంతల "మధ్యాహ్నం వస్తానమ్మా" అంది నిదానంగా.

అప్పటికైనా రావడానికి ఒప్పుకున్నావు కదా చాల్లే అనుకున్న తల్లి వంట యింటికేసి వెళ్ళిపోయింది.

తల్లికిచ్చిన మాట ప్రకారం, మధ్యాహ్నం పర్మిషన్ పెట్టలేదు శకుంతల. రోజూలాగానే ఆఫీసు వదిలే వరకూ వుండి బైటకొచ్చింది., దార్లో అరుణా, విమలా కనిపిస్తే "ఏదైనా పిక్చర్‌కి వెళ్దామా" అడిగింది.

'ఎప్పుడన్నా, అరుణగాని, విమలగాని 'పిక్చర్‌కి వెళ్దామా' అంటే "సినిమా పేరుతో, సిగ్గు విడిచి ఆడవాళ్ళు చేసే అర్ధనగ్న దాన్సులను చూసి లేని తల నొప్పి తెచ్చుకునేకన్న ఇంటికి వెళ్ళి కమ్మగా ఇంత తిని హాయిగా నిద్రపోతే వంటికి మంచిది." అని నీతిబోధ చేసే శకుంతల తనంత తనే సినిమాకు వెళ్దామా, అని అడిగేసరికి వాళ్ళిద్దరికీ నిజంగా మతిపోయినట్లే అయింది మేము వినేది నిజమేనా లేక కలగంటున్నామా? అని విభ్రాంతిపడ్డారు కూడా. మరో మాట చెప్పకుండా, చెప్తే శకుంతల మనసు మార్చుకుంటుందేమో అనే భయంతో చప్పున ఒప్పేసుకున్నారు, ఇదరూను.

వాళ్ళు ముగ్గురూ సినిమా చూసి కబుర్లు చెప్పుకుంటూ, నడిచి ఇల్లు చేరుకునేసరికి పదకొండు కావస్తున్నది. ఈ పాటికి మామయ్య చుట్టాల్ని తీసుకునివచ్చి, తనెంతకీ రాకపోయేసరికి విసుక్కొని వెళ్ళిపోయి వుంటారు' అని వూహించుకున్న శకుంతల తనని తనే అభినందించుకుంటూ హుషారుగా అడుగుపెట్టింది ఇంట్లో. నడవలోకి వెళ్తూనే పట్టెమంచంమీద. ఓ చేయి తల కింద పెట్టుకుని విష్ణుమూర్తిలా పవ్వళించి వున్న మేనమామను చూసి నిర్విణ్ణురాలయ్యింది.




"అమ్మా మామయ్య వచ్చారా ?" అన్నం దగ్గర కూర్చుంటూ ఆత్రంగా అడిగింది. ఆమాటకి తల్లి నిండుగా నవ్వుతూ "నువ్వు రాకపోవడమే మంచిదయ్యింది శకూ, ఆ అబ్బాయికి శలవుదొరకలేదట, ఎప్పుడో వస్తానని చెప్పారట" అంది.

"ఉహూఁ అలాగా" అని ఊరుకుంది శకుంతల.

ఆ మర్నాడు తను లేచేసరికి మేన మామ లేచి ఎక్కడికో వెళ్ళినట్లు తెలుసుకుని హాయిగా నవ్వుకుంది.

మామూలుగా ఆఫీసుకెళ్ళిసాయంత్రం తిరిగి వస్తుంటే ఓ షాపుముందు నిల్చుని ఎవరో తనను పిలిచినట్లయ్యి ఆగి తలెత్తి చూసిందామె. తనని నడిరోడ్డు మీద పిలిచి ఆపింది ఎవరో కాదు సాక్షాత్తూ తన మేనమామ భద్రయ్యగా గుర్తించి మొహం చిట్లించి నిలబడి పోయింది 'ఇంకా ఈయనగారు వెళ్ళిపోలేదా' అనే ధోరణిలో.,

'ఇలా రా' అన్నట్లు ఆయన చేయి విసిరేరు.

దగ్గరకు వెళ్ళాకగాని, మేనమామ ఒక్కడేకాక మరో వ్యక్తికూడా వున్నట్లు గ్రహించి బిడియంగా తల వాల్చుకుని నిలబడిపోయింది శకుంతల.

"మా మేనకోడలు, పేరు శకుంతల బి. ఎ, వరకూ చదువుకుంది. పెళ్ళయ్యే వరకు ఖాళీగా వుండటం ఎందుకని జాబ్ చేస్తున్నది" తనని ఆ అపరిచిత వ్యక్తికి పరిచయం చేస్తుంటే, ఓసారి తలెత్తి అతని వైపు పరిశీలనగా చూసి, కళ్ళు దాల్చుకుంటూ "నమస్తే" అంది వినయంగా.

"ఈయన మనవాళ్ళేను, పేరు గోవర్ధనగిరిరావు. ఎమ్. ఎ, చదివి బ్యాంక్‌లో అసిస్టెంట్ జాబ్ చేస్తున్నారు" అతన్ని కూడా పరిచయం చేసారు భద్రయ్యగారు. అతనూ నమస్తే

చెప్పి మిమ్మల్ని కల్సుకున్నందుకు చాలా సంతోషంగా వుందండీ అన్నాడు. శకుంతల ఏమీ అనలేదు. నవ్వి ఊరు కుంది. అతనుమాత్రం శకుంతలను పరీక్షగా చూడసాగాడు ఓసారి తలెత్తి చూడబోయి అతను తననే చూస్తుండ టంతో గబుక్కున తలవంచేసుకుంది. "ఛ. ఇతనేమిటి అలా చూస్తాడు మేనర్స్ లేకుండా అని కూడా అను కుంది మనసులో.

''రండి, కాఫీ తీసుకుని వెళ్దాము'' అతనే పిలిచాడు ముందుకి నడుస్తూ. వాళ్ళ వెంట హోటల్ కెళ్ళడానికి ఆమె కేమాత్రమూ ఇష్టంలేదు.

"క్షమించండి,నేను రాను, చాల తల నొప్పిగా వుంది" అంది నసుగుతూ.

"అదేమిటి మీరు రాకుండా ఎలా? సారిడాన్ మాత్ర వేసుకుంటే సరి, తల నొప్పి తగ్గిపోతుంది'' అతను తన మాటని ఏ మాత్రమూ లెక్కచేయ కుండా ప్రక్కనే వున్న హోటల్ వరండాలోకి దారి తీస్తుంటే, శకుంతలకు అతని చొరవకు ఎంతయినా కోపం వచ్చింది 'బీరకాయపీచులాంటి బంధుత్వం వుందనగానే, ఎక్కడలేని అభిమానాలూ ప్రదర్శిస్తారు ఈ మగ వాళ్ళు' అని విసుక్కుంది చిరాగ్గా.

ఫేమిలీరూమ్‌లోకి వెళ్ళి కూర్చు న్నాక, కాఫీఫలహారాలకు మామయ్యే ఆర్డరిస్తే బాగుండును అనుకుంది., కాని అతనే ముగ్గురికీ మూడు స్వీట్లు, మూడు చపాతీ ఆర్డరిచ్చాడు.

"నాకు ఏమీ వద్దు, టీ మాత్రం తీసు కుంటాను" అంది శకుంతల.

"మీకు అక్కర్లేకపోతే మీ వంతు కూడా నేనే తినేస్తాను, ముందు రాని వ్వండి" అన్నాడతను నవ్వుతూ. ఆ మాటకి సిగ్గుపడిందామె. బోయ్. స్వీట్లు, చపాతీ తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు. 'ఊఁ కానివ్వండి' అన్నట్లు చూసాడతను. భద్రయ్యగారు మాత్రం మరో మాట చెప్పకుండా తినడంలో నిమగ్ను లయ్యారు.

అతని ధోరణి చూస్తే 'మీరు తింటేనే గాని నేను తినలేను అన్నట్లుంది' ఇంకా బెట్టుచేస్తూ కూర్చోవడం సభ్యతకాదని పించిందామెకు. ఆ ప్లేటుని దగ్గరగా తీసుకుంది.

"నాకు స్వీటు చాలా యిష్టం, 'తీపి ఎక్కువగా తింటే లావు అయిపోతావు' అంటారు మిత్రులు. శరీరం పెరుగు తుందని. జిహ్వాచాపల్యాన్ని ఎన్నాళ్ళు అరికట్టుకోమంటారు మీరే చెప్పండి?" అతను చనువుగా మాట్లాడుతుంటే, మూతి బిగించుకుని కూర్చోవడం బాగో దని "ఏమంత లావుగా వున్నారు మీరు" అని, నాలిక్కర్చుకుంది శకుంతల.

చేయి కడుక్కుని లేచి నిల్చున్న భద్రయ్యగారు "నాకు కాఫీ 'టీ'లు అల వాటు లేదు బాబు, మీరు త్రాగిరండి,

నేను వక్క పలుకు తీసుకొస్తాను" అంటూ బైటకెళ్ళిపోయాడు, శకుంతల 'నేనూ వస్తాను ఉండు మామయ్యా' అనే లోపలే.

ఛీ మామయ్య కస్సలు బుద్ధిలేదు.

"మారేజి సెటిలయ్యేవరకేనా మీరు ఉద్యోగ్యం చేసేది లేక అయ్యాక కూడా కంటిన్యూ చేస్తారా ?" హఠాత్తుగా అడిగాడతను.

"అలా ఎందుకడుగుతున్నారు ? అంటే పెళ్ళయిన ఆడది ఉద్యోగం, చేయకూడదనా మీ అభిప్రాయం?" ఎదురుప్రశ్న వేసింది శకుంతల.

"మరీ అంత కర్కోటకుడిగా చిత్రించుకోకండి నన్ను. మగవాడి ఉద్యోగం సంగతి వేరు, సంపాదించడమే అతని ధ్యేయం కనుక ఉద్యోగంచేసి తీరాలి. కాని ఆడవాళ్ళు ఉద్యోగం చేస్తే అలా ఒక్క బాధ్యతేకాదు గదండీ. అటు ఉద్యోగం నిర్వహణ, ఇటు గృహిణిగా సంసార బాధ్యత, రెండు రకమైన ఉద్యోగాలు చేయాలంటే ఆడవారికెంత బాధగా వుంటుందో ఆలోచించే ఆ మాట అన్నాను, దాన్ని మీరు అపార్థం చేసుకుంటే క్షమించమని కోరుతున్నాను."

"మీ మాటని తొందరపాటుతో అపార్థం చేసుకున్నందుకు మీరే క్షమించాలి నన్ను" అంది శకుంతల కళ్ళు వాల్చి. "ఉద్యోగం చేయని ఉద్దేశ్యం ఉన్నప్పుడు ఆడపిల్లలు బియ్యేలు' ఎమ్మేలు ప్యాసవడం అనవసరమేనేమో ?"

"విద్యార్జనకు మితం ఏముంది ? అవకాశం, కోరికా వున్నప్పుడు చదువుకోవడంలో తప్పులేదు. కాని చదువు వున్నంతలోనే అవసరం లేకపోయినా వుద్యోగం చేయాలనుకోవడం, అనవసరంగా ఓ నిరుద్యోగిని బాధపెట్టడమే కదా ! ఐ మీన్, ఆడది ఉద్యోగం చేయడం తప్పు అని కాదు నా అభిప్రాయం. ఆడది కూడా ఏదో కొంత సంపాదిస్తేనేగాని కుటుంబము గడవదు అనే సమస్య ఉత్పన్నమైనప్పుడు ఆమె ఉద్యోగం విధిగా చేయవలసిందేను, కాని కాలక్షేపానికి, సరదాకి అయితే మాత్రం అనవసరమే అని నా ఉద్దేశ్యం. ఉద్యోగం చేస్తున్నాను కదా, మాకు వచ్చినలోటేమిటి అనే ఆలోచనతో, వంటమనుష్యులను, ఇల్లుకనిపెట్టుకుని వుండడానికి ఓ సర్వెంటుని ఏర్పాటు చేసుకుని, వచ్చిన జీతం చాలావరకు వాళ్ళకిందే ఖర్చుపెట్టేస్తే ఇక ఆ కుటుంబానికి ఆమె చేసే సాయం ఏముంటుంది ? అంతకన్న చదివిన చదువుతో ఇంటిని చక్కదిద్దుకోవడం, పిల్లలను క్రమశిక్షణతో స్వయంగా విద్యాబోధనచేసి పెంచడం ఎన్నోరెట్లు మంచిది కదా" అతను చెప్పడం ఆపాడు, పైకి అంగీకారం వ్యక్తం

చేయకపోయినా, మనసులో అతని భావాలను బాగానే మెచ్చుకుంది శకుంతల: "అలా అయితే మీరు మీ భార్యచేత ఉద్యోగం చేయించడం లేదా ?" కావాలనే ఆ ప్రశ్న వేసిందామె.

"ఆ మాట ఇప్పుడే ఎలా చెప్ప గలను, ఆ వచ్చే ఆమె ఎంతవరకూ చదువుకున్నదో, ఉద్యోగం చేయాలనే అభిలాష వుంటుందో లేదో, ఏలా చెప్ప మంటారు. నేనింకా బ్రహ్మచారినే" అతను మందహాసం చేశాడు.

"ఓ, ఐసీ" ఆ ప్రశ్న వేసినందుకు అమితంగా సిగ్గుపడిపోయింది శకుంతల.

"నేనడిగిన ప్రశ్నకు మీరింకా సమాధానం చెప్పలేదు."

"ఏం ప్రశ్న ?" తెల్లబోయి చూసిం దామె

"అదే, మీ ఉద్యోగం ఎంతవరకూ అనే నా ప్రశ్నకు మీరు జవాబు చెప్పనే లేదు" అతని కళ్ళల్లో కొంటె తనం ప్రస్ఫుటమయ్యింది.

"మీ ప్రశ్నకు నేనూ సమాధానం చెప్పలేను, ఆ వచ్చేవాళ్ళ ఉద్దేశ్యాన్ని బట్టి వుంటుంది నా జవాబు" శకుంతలా తెలివిగానే తప్పించుకుంది.

"మీరు చాలా గడుసువారు" అన్నాడతను.

"మీ కంటేనా ?" తనూ నవ్వేసింది గలగలా.

"అయ్యిందా మీరు కాఫీ త్రాగడం, ఇక వెళ్దామా" అంటూ వచ్చారు భద్రయ్యగారు.

"ఈ పూట చాలా హాయిగా గడిచింది నాకు." అన్నాడతను, విడిపోయే ముందు. "మాకూ కూడా" అంది శకుం తలా, సంకోచం లేకుండా.

"మరోసారి కలుసుకుంటామని ఆశిస్తా" అతను వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళే అతన్నే చూస్తూ నిలబడిపోయిన శకుంతల భుజంమీద చేయి వేస్తూ "ఈ పూటకి మనం ఇంటి కెళ్ళే ఉద్దేశ్యం వుందా" అన్నారు భద్రయ్యగారు నవ్వుతూ.

"ఫో మామయ్యా" కోపంతో చుర చురా చూసింది శకుంతల. "ఊఁ అడగడం మర్చిపోయాను. అబ్బాయి ఎలా వున్నాడు ? బాగున్నాడా ? ఏమిటీ అంతసేపు మాట్లాడుకున్నారు. ఏమంటు న్నాడేవిటి ?" భద్రయ్యగారిలోనూ హాస్యరసం తక్కువలేదు.

"ఏమంటున్నాడా ? మీ మామయ్య చూసారా ఎలా తప్పించుకున్నారో హోటల్ బిల్ తన మీద ఎక్కడ పడు తుందో అని" శకుంతల విసవిస నడుస్తూ వెళ్ళిపోయింది, వెనకాల్నుంచి ఆయన అమ్మాయ్ మాట అంటున్నా వినకుండా.

పడుకున్న దన్నమాటేగాని శకుంతలకు నిద్రపట్టడంలేదు కళ్ళు మూసినా, తెరచినా అతనే జ్ఞాపకం

వస్తున్నాడు. 'అంతసేంత బాగున్నాడు, అంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా ఏ కోశానా గర్వం లేకుండా ఎంత సౌమ్యతగా ఎంత నిరాడంబరంగా వున్నాడు' అని అనుకోసాగింది పదే పదే. నిద్ర పట్టని ఆమె చెవులకు, తల్లి, మేనమామ మాట్లాడుకోవడం, వాళ్ళ మాటల్లో తన పేరు దొర్లడం విని చెవులదే రిక్కించి వినసాగింది.

మేనమామ అంటున్నాడు "ఏ అరమరికలూ లేకుండా ఇద్దరూ బాగానే మాట్లాడుకున్నారమ్మాయ్. అతన్ని అడుగుతే తనకి మన అమ్మాయి నచ్చినట్లు కూడా చెప్పాడు. కనుక మనం మన అమ్మాయి అభిప్రాయం అడిగి తెలుసుకుంటే, ఏకంగా ముహూర్తాలు పెట్టేసుకోవచ్చు. నా అభిప్రాయం, అతను దానికీ నచ్చివుంటాడని. ఎందుకు నచ్చడూ, ఓ కాలొంకరా కన్నొంకరా? పెద్ద మొత్తంలో జీతం, అంతకన్న ఆడపిల్ల కోరుకునేది ఇంకేమిటి" అని.

"దానికి నచ్చితే అంతకన్న మనకి కావాల్సిందేమిటి? అయినా లాంఛన ప్రకారం అడుగుతాలే రేపు" అంటున్నది తల్లి. ఆ మాటల సారాంశము తెలియనంతటి అమాయకురాలేంకాదు శకుంతల. ముక్కూ మొహం తెలియని వ్యక్తిని పరిచయం చేయడం అదీ బజార్లోను, అయితే ఇందాక నాకు జరిగింది కొత్తరకం పెళ్ళిచూపులన్నమాట. గుండెమీద చెయ్యి వేసుకుని, తీయగా నవ్వుకుంది శకుంతల.

"అయితే ఏమని సమాధానం చెప్తావు. అతను నీకు నచ్చినట్లే కదా?" అడిగింది అంతరాత్మ - చిన్నగా.

"ఊఁ...ఊఁ. కాని అతనికి నేను నచ్చానో లేదో తెలియక్కర్లేదా?" నీతో మాట్లాడినంతసేపూ అతని కళ్ళు వింత కాంతితో మెరియడం నీవు గుర్తించలేదా? అంతకన్న నిదర్శనం ఇంకేం కావాలి."

"అబ్బ నన్ను డిస్టర్బ్ చేయకు. నాకు నిద్దరొస్తుంది బాబూ" అల్లరి మనసుకి బుద్ధిచెప్పి కళ్ళు మూసుకుంది నవ్వుతూ శకుంతలా, బి. ఎ.

